
జాకారం శివారులో కంకరపోసి ఉన్న రోడ్డు

# మహాజాతరకు పూర్తయ్యేనా?

**కోటి మంది భక్తుల కొంగుబంగారమైన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను ప్రతి రెండేళ్లకొక సారి జరపడం ఆనవాయితీ. ఈ జాతరకు దేశ నలుమూలల నుంచి లక్షలాది భక్తులు తరలివస్తారు. హైదరాబాద్, హనుమకొండ వైపు నుంచి వివిధ జిల్లాలు, ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి భక్తులు జాతీయ రహదారి-163 మీదుగా వస్తుంటారు. 2024 జాతరకు ఏడాది కాలంగా జరుగుతున్న ఎన్‌హెచ్ విస్తరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పనుల పురోగతిని పరిశీలించాల్సిన అధికారులు అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మేడారం జాతరకు మరో 68 రోజుల గడువు మాత్రమే ఉండగా పనులు గట్టమ్మ ఆలయం వరకు పూర్తి కావాల్సి ఉండగా మల్లంపల్లి వరకే పూర్తయ్యాయి. గడువులోగా పూర్తవుతాయో లేదోననే సందేహం కలుగుతోంది.**

- ములుగు, డిసెంబర్13(నమస్తేతెలంగాణ)

## నత్తనడకన ఎన్‌హెచ్ విస్తరణ పనులు

- దామెర నుంచి గట్టమ్మ వరకు 'సాగు'తున్న రోడ్డు పనులు
- సమీపిస్తున్న మేడారం జాతర.. ఇంకా 68 రోజుల గడువే
- 2024 జాతరకు అడ్డంకిగా మారనున్న రవాణా
- పనులు పూర్తి కాకుంటే భక్తులకు ఇబ్బందులే
- పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్న అధికారులు

రూ. 350 కోట్లతో జాతీయ రహదారుల విభాగం ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా దామెర నుంచి గూడెప్పాడ్ వరకు, నీరుకుళ్ల క్రాస్ నుంచి ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయం వరకు ఎన్‌హెచ్ 163 విస్తరణ పనులను గతేడాది ప్రారంభించారు. వీటిని దక్కించుకున్న సంబంధిత కాంట్రాక్టర్ తొలుత వేగవంతంగా పనులు చేసినప్పటికీ ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణ లేక నెమ్మదిగా కొనసాగుతున్నాయి. ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణంతోపాటు మధ్యలో డివైడర్‌ను నిర్మిస్తున్నారు. ఈ విస్తరణ పనులను చేపట్టిన కాంట్రాక్టర్ అక్కడక్కడ కల్వర్టు పనులను పూర్తి చేయలేదు. రోడ్డు నిర్మాణాన్ని కూడా మధ్య మధ్యలో పూర్తి చేశారు. ఒక లేయర్ బీటీ మాత్రమే వేశారు. మరో రెండు లేయర్ల బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. ములుగు జిల్లా పరిధిలో మహ్మద్‌గౌస్‌పల్లి నుంచి జాకారం వరకు కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభ దశలోనే ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉన్న ఎన్‌హెచ్ రోడ్డుకు ఇరువైపులా మట్టిని, మెటల్ రోడ్డును పోయగా ప్రస్తుతం భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము లేస్తున్నది. దీంతో ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడా మెటల్ రోడ్డు సరిగా లేక గుంతలను తలపించేలా ఉండడంతో రాత్రి వేళల్లో వాహనాలపై ప్రయాణం కొనసాగించే వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురయ్యేలా అవకాశం ఉంది.

### పనులు పూర్తి కాకుంటే భక్తులకు ఇబ్బందులే

జాతీయ రహదారి మీదుగా మేడారానికి వివిధ వాహనాల్లో భారీ ఎత్తున తరలివచ్చే భక్తులకు ఎన్‌హెచ్ విస్తరణ పనులు అడ్డంకిగా మారనున్నాయి. జాతరలోగా గట్టమ్మ దేవాలయం వరకు పూర్తి కానట్లయితే వాహనాలు రోడ్డు ప్రమాదానికి గురికావడంతో పాటు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా తలెత్తే అవకాశం ఉండనున్నది. ఏటా జాతరకు నెల రోజుల ముందు నుంచే భక్తుల తాకిడి మేడారానికి పెరుగుతుంది. అది కూడా హనుమకొండ నుంచి ములుగు మీదుగా ఎక్కువ సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఎన్‌హెచ్ విస్తరణ పనులు ఆలస్యం కావడంతో మేడారం భక్తుల తాకిడికి పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ములుగు జిల్లాలో పనిచేస్తున్న ఉన్నతాధికారులందరూ నిత్యం హనుమకొండ నుంచి రాకపోకలను కొనసాగించే వారే. జాతరను దృష్టిలో ఉంచుకొని పనుల వేగవంతానికి తగిన చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం, వారి అలసత్వ ధోరణికి భక్తులకు తిప్పలు తప్పేలా లేవు. ఏదేమైనా జాతరకు నెల రోజులకు ముందు ప్రస్తుతం జరుగుతున్న ఎన్‌హెచ్ విస్తరణ పనులు గట్టమ్మ దేవాలయం వరకు చేరేలా లేవు. జాతరకు వచ్చే భక్తులకు రవాణాపరమైన ఇబ్బందులను అధికారులు ఏ మేరకు తలెత్తకుండా చర్యలు చేపడుతారో వేచి చూడాల్సిన అవసరం ఉంది.


మల్లంపల్లి వద్ద అరకొరగా కొనసాగుతున్న పనులు


మల్లంపల్లి వద్ద ఎన్‌హెచ్‌పై కొనసాగుతున్న కల్వర్టు పనులు

## విరగకాసిన గురివింద


చెట్టు తీగకు కాసిన గురివింద గింజలు


గురివింద గింజలు

ములుగురూరల్, డిసెంబర్13: గురివింద గింజలు ఎప్పుడైనా చూశారా.. దాని ముందు భాగమంతా ఎరుపుగా ఉండి వెనుక వైపున ఓ నల్లటి మచ్చ కలిగి ఉంటుంది. అందుకే దీన్ని తన నలుపెరుగని గురువింద గింజ అంటారు. ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్న ఇవి పూర్వం అందరి నోళ్లలో నానేవి. ఇవి ములుగు మండలం భూపాల్‌నగర్-మల్లంపల్లి మధ్యలో ఉన్న జాతీయ రహదారి వెంట ఉన్న చెట్టుకు విరగకాయగా 'నమస్తే తెలంగాణ' క్లిక్‌మనిపించింది. ఎరుపు, నలుపు రంగుల్లో ఉండే ఈ గురివింద గింజలు చెట్టు తీగకు విరగకాసి దర్శనమిచ్చాయి. ఎనుకటి రోజుల్లో వీటిని బంగారాన్ని తూకం వేసేందుకు వాడేవారు. గొప్పలు చెప్పుకునే వారిని గురివింద గింజతో పోల్చే సామెత కూడా నేటికీ ఆచరణలో ఉన్నది.




లక్నవరం సరస్సుపై ఉన్న మొదటి, రెండో వేలాడే వంతెనలు


లక్నవరం సరస్సుపై ఏర్పాటు చేసిన మూడో వంతెన

# 12 దీవులు 3 వంతెనలు..

## చూడచక్కని లక్నవరం

- మూడు దీవులకు వెళ్లేలా ఏర్పాట్లు
- మంత్రముగ్ధులను చేస్తున్న సరస్సు
- ప్రత్యేక ఆకర్షణగా బోటు షికారు, బ్యాటరీ బండ్లు
- నూతన హంగులతో కాటేజీలు
- ప్రతి వారం 10 వేల మంది సందర్శకుల రాక

*రాష్ట్ర ఏర్పాటు తర్వాత లక్నవరం సరస్సు పర్యాటకానికి కొత్త చిరునామాగా మారింది. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ(టీఎస్‌టీడీఎస్) తాజాగా ఇక్కడ మూడో వేలాడే వంతెనను ఏర్పాటు చేసింది. దీంతో మూడు దీవుల వరకు పర్యాటకులు వెళ్లేందుకు దారి పడింది. చూసినంత దూరం నీరు, మధ్యలో 12 దీవులతో ప్రకృతి అందాలను కలబోసుకున్న లక్నవరానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సులోని వేలాడే వంతెనలు, ద్వీపాలు పర్యాటకుల మనసు దోస్తున్నాయి.*

- వరంగల్, డిసెంబర్13(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**లక్నవరంలో తీగల వంతెనలు**

| వంతెన | పొడవు | ఖర్చు | ప్రారంభం |
|---|---|---|---|
| మొదటిది | 175 మీటర్లు | రూ.1.50 కోట్లు | 2007 |
| రెండోది | 212 మీటర్లు | రూ.5.50 కోట్లు | 2018 |
| మూడోది | 120 మీటర్లు | రూ.1.50 కోట్లు | 2020 |



లక్నవరం సరస్సు కట్ట నుంచి మొదటి ద్వీపం(కాకరకాయలబోడు)ను కలుపుతూ 175 మీటర్ల పొడవుతో ఒకటిన్నర మీటరు వెడల్పుతో తీగల వంతెన నిర్మించారు. 2007 నవంబర్ 15 నుంచి దీనిపై పర్యాటకుల రాకపోకలు మొదలయ్యాయి. సరస్సు మధ్యలో నీటిపైన ఉన్న అనుభూతి కలిగేలా ఈ వంతెన నిర్మాణం సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. మొదటి దీవిలో 16 కాటేజీలతో పాటు పర్యాటకులకు ఘుమఘుమలాడించే వంటకాలతో రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు. అద్దాలతో నిర్మించిన రెస్టారెంట్ నుంచి సరస్సు మొత్తం కనిపిస్తుంది. బోటింగ్ అవకాశం ఉంటుంది. పర్యాటకుల సంఖ్య పెరుగు తుండడంతో తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థ ఇక్కడ విస్తరణ పనులు మొదలుపెట్టింది. రాకపోకలకు ఒకే దారి ఉండడం వల్ల ఇబ్బంది లేకుండా ఉండేందుకు వీలుగా 212 మీటర్ల పొడవు, ఒకటిన్నర మీటరు వెడల్పుతో రెండవ వంతెనను నిర్మించారు. 2017లో పనులు ప్రారంభించి కేవలం సంవత్సరం వ్యవధి లోనే పూర్తి చేశారు. మొదటి ద్వీపం నుంచి 1800 మీటర్ల దూరంలో రెండో దీవి ఉంది. ఇక్కడికి పడవలో మాత్రమే వెళ్లే అవకాశం ఉంటుంది. రెండో దీవిలో రెండు అద్దాల కాటేజీలు ఉన్నాయి. మరో 8 డార్మెట్ రూమ్‌లను నిర్మించారు. సకుటుంబ సపరివారంగా వచ్చే వారికి ఈ రూమ్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. రెండో దీవి నుంచి మూడో దీవికి మధ్య 120 మీటర్ల వేలాడే వంతెనను నిర్మించారు. ఇది తాజాగా అందుబాటులోకి వచ్చింది. మూడో దీవిలో చిన్నపిల్లల కోసం ఒక పార్కుతో పాటు విలాస వంతమైన కాటేజీలను నిర్మిస్తున్నారు. ఆ కాటేజీల్లోకి పర్యాటకులు వెళితే ఊటీకి వెళ్లినట్లు అనుభూతి కలిగేలా నిర్మిస్తున్నారు. టీఎస్‌టీడీసీ పర్యాటకులు బస చేయడానికి మొదటి దీవిలో పిల్లల కోసం బ్యాటరీ బైకులు, బ్యాటరీ కార్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. జిప్ సైకిల్‌పై పర్యాటకులు వెళ్తూ నీళ్లపై నడిచినట్లుగా వారి అనుభూతిని పంచుకుంటున్నారు. మొదటి వంతెన టికెట్ కౌంటర్ నుంచి మొదటి ఐలాండ్ కాకరకాయలబోడు వరకు జిప్ వే సౌకర్యం రానున్నది. దీంతో పర్యాటకులు మరింత అనుభూతిని పంచుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు

### గిరీష్ భరద్వాజ్ నైపుణ్యత

కర్ణాటకలోని మంగళూరుకు చెందిన ఇంజినీర్ గిరీష్ భరద్వాజ్ లక్నవరంలోని వేలాడే వంతెనల రూపకర్త. తీగల వంతెనల నిర్మాణంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. తక్కువ ఖర్చుతో తీగల వంతెనలు నిర్మిస్తున్న గిరీష్ భరద్వాజ్‌ను కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ'తో గుర్తించింది. లక్నవరంలోని మొదటి రెండు వంతెనలకు ఆయన రూపమిచ్చారు. మూడో వంతెనను గిరీష్ కొడుకు పతంజలి భరద్వాజ్ రూపొందించాడు. గిరీష్ మెకానికల్ ఇంజినీరింగ్ చదివారు. వీళ్ల సొంతూరు మంగళూరు సమీపంలోని సులియా. ఇది మారుమూల ప్రాంతం. రోడ్డు ఉండేది కాదు. పట్టణానికి రావాలంటే మధ్యలో పాయస్వి నది అడ్డుగా ఉండేది. వానకాలంలో రాకపోకలు ఉండేవి కావు. దీంతో అప్పట్లో 1975లో గిరీష్ సొంతంగా స్టీల్ ఫ్యాబ్రికేషన్ పరిశ్రమ నెలకొల్పాడు. వాళ్ల నాన్న కోరిక మేరకు కట్టెలు, స్థానికంగా అందుబాటులో ఉన్న సామగ్రితో 1989లో సొంతూరిలో తీగల వంతెన నిర్మించాడు. సులియా గ్రామస్తుల కష్టాలను తొలగించిన గిరీష్‌కు గుర్తింపు వచ్చింది. అప్పటి నుంచి తీగల వంతెనలను నిర్మించడం కొనసాగిస్తున్నారు. గిరీష్ కొడుకు పతంజలి సివిల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ చదివి ఇదే రంగంలో స్థిరపడ్డాడు. మూడో వంతెన నిర్మాణం పూర్తిగా ఈయన ఆధ్వర్యంలోనే జరిగింది.









